# షమ్మీఖన్నా అను సర్పనాయకుడి కథ

ఎన్.కె. రామారావు

ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి తన ముందు నిలుచున్న శాల్తీని మరోసారి పరీక్షగా చూశాడు గుండు చెంబుకు చుట్టూ ఏవో అతికించినట్టు బట్టతల చుట్టూ రాగి వెంట్రుకల శిథిలాలు, పొడుచుకు వస్తున్న పొట్ట, దాన్నదిమిపెట్టడానికి పెద్దబెల్టు. దాదాపు అరవై ఏళ్లున్న వాడొకడు. అతని వెంట సన్నగా, పొడుగ్గా అక్కడక్కడా నెరిసిన జుట్టు, యాభై యెదు, యాభై ఎనిమిది మధ్య వయసు వాడొకడు. వీళ్లిద్దరూ ఒక పక్కగా నిలబడ్డారు. రెండోవైపు ఇద్దరు బలిష్టమయిన యువకులు నిలబడ్డారు.

''మీ రెండు గ్రూపుల్లో ముందు ఎవర్ని కొట్టార్రా?'' రాంరెడ్డికి ఓపిక నశించి పోతున్నది.

''ఆ పల్లెంటికల బట్టతలోడు నన్ను ముందు కడుపుల గుద్దిండు సార్'' ఒక యువకుడు జవాబిచ్చాడు.



''అసలేం జరిగిందో మీరు చెప్పండి'' సన్నటి పెద్దాయనను మర్యాదగానే అడిగాడు.

''మా రాజా అసలేం జరిగిందో, ఎందుకు జరిగిందో అర్థం కావటం లేదు. కానయితే మమ్మల్ని ఇద్దరినీ మడతపెట్టి ఉతికింది వీళ్లిద్దరే. కారణం తెలియటం లేదు. పన్లో పనిగా చెప్పుకుంటాను నా పేరు చింతిర్యాల సుబ్బిరెడ్డి''

కుర్రాళ్లిద్దరూ ఏమాత్రం నదురూ బెదురూ లేకుండా వున్నారు. దున్నపోతుల్లా వుండటమే కాకుండా అడపాదడపా తన ముందే గుట్కా నోట్లో వేసుకుంటున్నారు. పోలీసు స్టేషన్‌లో ఇంతధైర్యం ప్రదర్శిస్తున్నారంటే వీళ్లకు అన్నుదన్నుగా ఎవరో ఒక మంత్రి వుండి వుంటాడు. వీళ్లను లాకప్పులో వేసి, కుమ్మి, ఇరగదీసి, తోలు వలిచి అమ్మకానికి పెట్టడం పెద్దపనేమీ కాదు. కాపోతే తర్వాత ఇబ్బందుల్లో పడే ప్రమాదముంది. తనకు రిటైర్మెంట్ ఇంకా ఆర్నెల్లే వుంది.

''ఒరే పోరగా కొట్లాట ఎందుకు జరిగింది?'' లాలనగా అడిగాడు.

''ఏం లేదన్నా సిన్మా ఇంటర్‌బెల్లో...''

రాంరెడ్డికి సర్రున కోపం వచ్చింది. ''నన్ను అన్నా అన్నావా'' సీరియస్‌గా అడిగాడు ''ఔనన్నా''

రాంరెడ్డికి ఒక్క క్షణం ఆ కుర్రవాడి తలమీద అభయ హస్తం వుంచుతున్న ఒక నాయకుడి మూర్తి, అతని తలచుట్టూ దేవతల తాలూకు తేజో చక్రం గోచరించినట్లయి వులిక్కిపడ్డాడు.

''అన్నావా అయితే ఫర్లే అలా అనలేదనుకుని అనమనే అడుగుతున్నా'' గొంతులోకి మృదుత్వాన్ని తెచ్చుకోవటానికి శాయశక్తులా కృషి చేసి సఫలమయ్యాడు.

''ఇంటర్‌బెల్లో- స్కూల్ డ్రింక్ తాక్కుంట...''

''స్కూల్ డ్రింకేమిట్రా స్కూళ్లలో డ్రింకులు కూడా ఇస్తున్నారేమిటి? మేం చదువుకునేటప్పుడు మధ్యాహ్న భోజన పథకాలూ లేవు. డ్రింకులూ లేవు'' రాంరెడ్డి వాపోయాడు.

''కూల్‌డ్రింకు, ఇంటర్‌వెల్ ఇలాంటివి సందర్భానుసారం అర్థం చేసుకోవాలి మారాజా'' సుబ్బిరెడ్డి వినమ్రంగా మనవి చేశాడు.

''గదే గదే స్కూల్ డ్రింకు తాక్కుంట ఈ సిన్మా తీసినోడినీ హీరో ఏసం ఏసినోడిని, వాళ్లమ్మనూ, అక్కనూ తిట్టుతున్నం''

''వాళ్ల నాయనమ్మను కూడా'' రెండోవాడు అందించాడు. ''ఈ బట్టతలోడు నన్ను ఎందుకు తిడుతున్నవని అడిగిండు, నిన్నెవడు తిట్టిండ్రా బాడఖావ్ అని మంచితనంగా చెప్తనే వున్న. బట్టతలోడు నా కడుపులకెల్లా ఒక్కగుద్దు గుద్దిండు. ఇగ నేనూ మా దోస్తు ఈ బొర్రోడిని మడతబెట్టి వుతికిన మాట సత్యం. గింతల ఈ బక్కాయనొచ్చి అభం శుభం తెలియని ముసలోడు కొట్టకాకండి గీయనే వీసిన్మాలో హీరో. సర్పనాయకుడు గీనే అన్నడు. ఇంగ చూస్కో నా సావిరంగా జనాలు ఉర్కిరాబట్టిండ్రు. ఆ జనం తనను చూడటానికి వస్తున్నరనుకొని ఈ బట్టతలోడు కళ్లు మూసుకుని వాళ్లకు చేతులూపుతున్నడు. మమ్ముల్ని వీడి దోస్తులనుకొని తంతరేమోనని ఉరుకుడు షురూ చేసెటల్కె జనంల కెల్లి ఓ పోరడు. ''అన్నా గీడే సర్పనాయకుడ''ని పెద్దగ అర్చిండు. జనం వీణ్ణి తన్ననిక రాంగనే వీళ్లిద్దరు వురుకుడు షురూ చేసింరు. ఎట్లయితినేం నలుగురం ఈడబడ్డం.''

''ఇంతకూ సిన్మా హాల్లో కొట్లాటేంటిరా కారణం చెప్పకుండా కొట్లాడుకుంటే ఎట్టరభయి. సరే మీ పేర్లు చెప్పండి. కేసుగట్టి కోర్టుకేస్తే ఆడ మీ చావు మీరు చావండి'' అంటూ రాసుకోవటం మొదలెట్టాడు. మేస్ట్రీటుగారు రెండు ఛార్జిషీటులు నలుగురు నేరస్తుల్ని చూశారు. ఒక కేసులో నేరస్తులు, మరో దాంట్లో బాధితులు. రెండోదాన్లోనూ అలాగే వుంది. రాంరెడ్డి లేచి అయ్యా! నేరానికి తగిన కారణాలు కనిపించటం లేదు. నాకెందుకో భారతీయ శిక్షాస్మృతి కాకుండా ఒక ప్రత్యేక చట్టం కింద వీళ్లు శిక్షార్హులు అని అంతరాత్మ ప్రబోధిస్తున్నది. దేవరవారు క్షుణ్ణంగా విచారించి తగిన చట్టం కింద తగల వలసినంత శిక్ష తగిలించవలసిందిగా ప్రార్థిస్తున్నారు'' అన్నాడు.

ముందుగా మేస్ట్రీటు వారు నలుగురినీ తమ తమ పేర్లు వృత్తి విలాసాలు తెలియజేసి వారి వారి

With Best Compliments From

A.S.R. TRANSPORT

Fleet Owners & Transport Contractors

S&S Plaza, First Floor, Flat No. 103, Sri Krishna Nagar,
Jubilee Hills Road, Hyderabad - 500 045.
Tel: (O) 040 - 23541205 Fax: 23541875
B.O: Vijayawada. Tel: (0866) 2451499
B.O: Coimbattore. Tel: (0422) 2252674
H.O: 37/120, Behind Indira Gandhi Co-op. Hospital,
Kadavanthra, Ernakulam - 682020
Ph: (0484) 2206920, 2206114. Fax: 2205159

కథలను సవిస్తరంగా మనవి చేసుకోమన్నారు. అవ గింజంత రహస్యం కూడా వుండకూడదని, అబద్ధాలు అసలే సహించనని బల్లగుద్ది వార్నింగిచ్చారు. ముందు బట్టతల మనిషి పెద్దమనిషికి అవకాశం ఇచ్చారు.

**షమ్మీఖన్నా అను సర్పనాయకుడు లేక ఎర్రబెల్లి సోమయ్య**

''నా పేరు షమ్మీఖన్నా వురఫ్ సర్పనాయకుడు మా అమ్మా అయ్యా పెట్టిన పేరు సోమయ్య. సన్నాఫ్ రామయ్య. ఏజ్ 59 సంవత్సరాల 11 నెలల మూడు రోజులు. వృత్తి: సినిమా నిర్మాత, హీరో, సహసంభాషణా రచయిత, గేయ రచనా సహాయకుడు, కథాస్క్రీన్‌ప్లే, రచయిత, ప్రస్తుతం రిలీజయిన సినిమా సర్పనాయకుడు. ఇంగో రెండు సిన్మాలు మహోదాత్త ప్రణయం మామ్మగారికి మనుగుడుపులు నిర్మాణంలో వున్నయి'' మేస్ట్రీటుగారికి ఆనందం కలిగింది. వీడు తన వార్నింగుతో వయసు నెలలూ రోజులుతో సహా చెబుతున్నాడు. వీడు ఏది చెప్పినా సత్యమే చెబుతాడు లాగుంది. ఇలాంటి వారి అవసరం సమాజానికి ఎంతయినా వుంది.

మేస్ట్రీటుగారు గొంతు సవరించుకొని రెండు పార్టీలవారూ చూశారు. బాలురూ – వృద్ధులూ అయిన నేరస్తులు అబ్బా ఎంత ద్వంద్వం? అసలు ఈ సృష్టే ద్వంద్వాల మయం కదా. ఆలోచనలోంచి తేరుకునే సరికే కోర్టుహాలంతా జనంతో నిండిపోయింది. షమ్మీఖన్నా గొంతు సవరించుకొని ఒక కాలు ముందుకు ఒక చేయి గాలిలోకి లేపి మిగిలిన చేయి నడుం మీద వేసుకుని ఒక కాలువెనక్కు వేసి తన కథ మొదలెట్టాడు.

''నా అసలుపేరు ఎర్రబెల్లి సోమయ్య. 1857లో మా అమ్మా నాయిన జరిగిపోయింద్రు. ఎందుకు యాదికుందంటే తమ్‌సా నహిదేఖా రిలీజయింది మా అయ్య చచ్చిన్నాడే. నేనొక్కడినే పోరడిని. ఆడ యీడ పన్లు చేస్తూ, హిందీ సిన్మాలు చూస్కుంట కాలం ఎల్లదీసెటోణ్ణి చిన్నప్పుడు షమ్మీకపూర్ సినిమాలు లెస్సచూసెటోణ్ణి. గాయనంటే నాకు బడే ఇష్టం అని లెక్క. ఎగురుడు, దుంకుడు, వంకర్లు బోవుడు ప్రాక్టీస్ చేసినా నాకు కల్లో గూడా ఆడే వస్తుండే టాంగా బండెక్కి తుమ్‌సా నహిదేఖా అని పాడుతున్నట్టు కలలు బడేయి. ఎవరైనా పోరి ఒంటరిగ కండ్ల బడ్తే ఏయి గుల్ బదన్ పూలోంకి మెహక్ కాంటోంకి చుబన్ అని పాటందుకునెటోణ్ణి. కొన్ని పోల్లలు నీ గాడిద ముఖంలా నా చెప్పు అని తిట్టేయి. కొన్ని పోల్లలు ముస్కరాయించుకొనేయి'' మేస్ట్రీటుగారు ఆసక్తిగా వింటున్నారు. విచిత్రంగా అప్పుడు కోర్టులోనున్న నడంకారు జనానికి, ఎ.పి.పి. వోకు కొంతమంది లాయర్లకు అప్పటికి, ఇప్పటికి ఎప్పటికీ షమ్మీకపూరే అభిమాన హీరో. టైం మెషీన్‌లో భూతకాలంలోకి వెళ్లినట్లుగా వాళ్ల మనస్సులు జంగ్లీ జాన్‌వర్, ప్రొఫెసర్ లాట్‌సాబ్ చిత్రాల చుట్టూ కాంతివేగంతో పరిభ్రమించి తిరిగి యథాస్థానంలోకి వచ్చేశాయి.

జవాను బయట కలకలం విని వెళ్లి చూసొచ్చి:

''అయ్యా బయట జనప్రవాహం నిమిషానికి వెయ్యిమందితో కాంపొండులోకి చేరుతున్నది'' మనవి చేశాడు.

''ప్రస్తుత జనసాంద్రత జనమట్టం విన్నవించు '' ఆజ్ఞాపించారు.

''అయ్యా సాంద్రత ఇసుక వేస్తే రాలనంత. జనమట్టం పదివేలమంది''

షమ్మీఖన్నా అందుకున్నాడు.

''అట్లనో ఇట్లనో కష్టపడి ఒక లక్షరూపాయలు ఎనకేసిన సారాదందా, కల్లుదందా, ఇసుక కాంట్రాక్టులు ఇది మన పని కాదు అనుకోకుండా అన్ని పన్లు చేసిన ఒక చిన్న ప్లాటుకొంటే దానికి ఆరునెల్లకే డబుల్ పైసలొచ్చినయి ఇగ మన దందా గిదే అనుకుని ప్లాట్లు కొన అమ్మ కొన అమ్మ. గిట్ల చేస్తుంటే చూస్త చూస్తనే తీన్‌కరోడ్ కమాయించిన ఇగ గిప్పుడు రాజకీయంల చేరాలె అని ఒకాయన మంచి మాట చెప్పిండు. గట్లనే జేసిన అప్పుడొకాయరన గీ కొనుడేంది అమ్ముడేంది. ఎవరివయినా ఖాళీ ప్లాట్లు జూడు కబ్బాపెడదామన్నడు. గప్పట్నించి పోరంబోకు పోరల్లి జమ చేసి మస్తు ప్లాట్లు కబ్జాపెట్టిన. ఆయిటెంక అమ్ముకున్న''.

''మిస్టర్ ఖన్నా- సారీ – సోమయ్యా నువ్వు చెప్పేదంతా రికార్డుల్లోకి ఎక్కింది. రేపు మరో కేసులో ఈ విషయాలే నీకు వ్యతిరేక సాక్ష్యంగా వుపయోగించవచ్చు. నీకు తెలియజెప్పటం కోర్టు బాధ్యత' మేస్ట్రీటు గారు హెచ్చరించారు.

''గట్లనా మా అయ్య పున్నెం వుంటది అయి రికార్డుల కెల్లి తొలగియ్యుండ్రి. ఇప్పుడు చెప్పిందంతా వుల్లెక్కం. మజాక్కు చెప్పిన''

''అదేం కుదరదు'' మేస్ట్రీటుగారు నిష్కర్షగా చెప్పారు.

''సరే గట్లనే కానియి. తీయి మనమీద కేసెవరు పెడతరో చూద్దం'' షమ్మీ కొంచెం పెడసరంగా మాట్లాడాడు.


(ఇప్పుడు బెడితే ఏం పీకుతున్నవ్- వినయంరా వినయం కావాలి సుబ్బారెడ్డి షమ్మీఖన్నా చెవిలో చెప్పాడు. సర్పనాయకుడు సుబ్బిరెడ్డిని ఖామోష్ అని గద్దించి కథనం కొనసాగించాడు).

''మనకాడ మస్తుపైసుంది. ఇగ సిన్మా తీయాలని ఖాయిష్ బుట్టింది. మా దోస్తు కొడుకొకడు అంకుల్ నేను పాటలు రాస్తనంటే ఆనికి ఛాన్సిచ్చిన. సినిమా కత గిట్ల నేనే తయారు చేద్దారనుకొని కలం కాయితం బట్టిన. ఇంకొక దోస్తు ఆ బేకార్ పన్లు నీకెందుకులే కమామిషలీ అని ఓడున్నడు అని తోటి రాయించు అంటే గట్లనే చేసిన. పాటలు రాసెటోడు ఆశ్రీ అని పెట్టుకున్నడు. పెట్టుకోనియి తీయి ఎంతమంది మారు పేరు పెట్టుకోవటంలేదు. మనం అంటే నేను పెట్టుకోలేదా అని తమాయించిన. సినిమాలో పని చేసెటోల్లందరికి ముందే చెప్పిన. ఎవరు ఏం పని చేసినా సినిమా పేర్లల్ల మటుకు అన్నీ నా పేరు మీదే ఏసుకుంట. అందరూ ఒప్పింరు కానీ ఆశ్రీగాడు హర్గిస్ ఒప్పలే ఈ చింతర్యాల సుబ్బిరెడ్డి మషూర్ దర్శకుడు ఈన ఎనకటికి ముప్పై సినిమాలు డైరెక్షన్ చేస్తే ఇరవై ఎనిమిది పాసయినయంట. రెండే ఫెయిలంట. ఇప్పుడాయనకు ఛాన్సులు లేక దివాలుగ కూచుంటే ఆయనకి దర్శకత్వం ఛాన్సిచ్చిన. ఆయనకు సుత చెప్పిన. గాయన పేరు దర్శకుడిగా వేస్తగానీ దర్శకత్వం నాదే. ఆడేమైనా కట్టూ – స్టార్టూ లైట్సాన్ లైట్సాఫ్ అనాలంటే గాయనొప్పుకున్నడు గట్ల ఈ సినిమా తయారు చేసినం. దీనిపేరు సర్పనాయకుడు'.

(''నీ సిన్మా సాంఘికమా, జానపదమా చారిత్రకమా పౌరాణికమా?'' ఎ.పి.పి. వో. కుతూహలంగా అడిగాడు.

''అన్నీ కలిపి కొట్టిన పదారేళ్ల సినిమా).

ఇంగ కథ తయారయినంక హీరోకి వేరే పైసలిచ్చుడెందుకని ఆ ఏసం నేనే కట్టిన మాంచి విగ్గులు తయారు చేయించిన నా షమ్మీ ఓలె స్టెప్పులేసెటందుకు ఆశ్రీతో గసువంటి పాటలు రాయించిన. యుద్ధాలు గిట్ల చేసేటందుకు ఖడ్గాలు నేనే నమూనా ఇచ్చి చేయించుకున్న నాకతను మరొకడు కాపీకొట్టకుండా ఎప్పటికప్పుడు మారుపులు చేసి స్టోరీ గుమాయించిన ఎవర్నీ నమ్మలేం సారూ! హీరోయిన్‌గా హిందీ పోరిని తెద్దామంటే పైసలు శానా అయితయన్నరు అందుకని



మనకాడ సెకండు హీరోయిన్‌గా పని చేస్తున్న మిళింద కన్యకు హీరోయిన్ ఇచ్చిన. ఎంత చెడ్డా మనోళ్లకు మనం ఛాన్సులిచ్చి పైకి తెస్తే నలుగురు తల్లుకుంటరు సారూ, నా తల్లి వేసానికి వకుళ మాంబను పెట్టిన. అది చిన్న పోరే సార్ ఒక సిన్మాలో వదినేసం ఏస్తే హిట్టయిందని ఆమెకు అన్నీ వదినేసాలు తల్లేషాలు ఇస్తున్నరు. దాన్ని చూస్తే మీరు పరేషాన్ అవుతర్ సార్.

(బండి పట్టాలు తప్పటం గమనించి కోర్టు జవాన్ హుష్ అని శబ్దం చేశాడు. షమ్మీ వులిక్కిపడి మళ్లీ కథలోకి వచ్చాడు)

ఇగ నేను పాటల షూటింగుకు అడవుల పొంటి చేలపొంటి తోటలపొంటి పోయి కంప్లీట్ చేసిన. ఈ సుబ్బిరెడ్డి రానన్నడు. మొత్తానికి సిన్మా కంప్లీట్ చేసి, సెన్సార్ చేయించి రిలీజు చేసిన, టాక్ ఎట్లున్నదో చూద్దారనుకొని సుబ్బిరెడ్డిని తీసుకొని టాకీసుకు పోయిన. గింతల గీలొల్లి శాటిలైటు రైట్లు అమ్ముదామనుకున్న. ఈ లొల్లిల గడెప్పుడు కావాలా?'

(అది సరే నీ పేరులో షమ్మీ వరకు అర్థమయింది. ఖన్నా విషయం కూడా చెప్పి మాకు జ్ఞానోపదేశం చేయరాదు?

ఎ.పి. పి.వో. దాదాపు ప్రాధేయపడ్డాడు).

(గదా సారూ! షమ్మన్న 1969 నుండి జర ఎనకబడ్డడు. రాజేష్ ఖన్నా వచ్చేసిండు ఖన్నా పాటల్లో మెడలు ఇచ్చిత్రంగా తిప్పుతుండేటోడు. ఆడు కూడా నాకిష్టమయిండు. అందుకనీ ఆని పేరులో సగం తీసుకుని షమ్మీ ఖన్నా అయిన బాగలేద్సార్ పేరు?)

(బహురమ్యంగా వుంది. నీ సృజనాత్మకత వుందే. దాన్నెవరైనా సరే మెచ్చుకుని తీరాలి. కాక పోతే ఇద్దరు మహానటుల పేర్లు పెట్టుకుని వారి ప్రతిష్టకు గ్రహణం పట్టించావు. అది వేరే విషయం. ఎ.పి.పి.వో. పేరు బాగుందని మెచ్చుకున్నాడు).

''కొట్లాట కారణం చెప్పవయ్యా''

మేస్ట్రీటుగారు విసుక్కున్నారు.

''నాకూ తెలియద్‌సార్.''

ఇదెక్కడి గోలయ్యా- సరే సుబ్బిరెడ్డి నువ్వురా

**చింతిర్యాల సుబ్బిరెడ్డి, సన్నాఫ్ చెంగారెడ్డి, వయస్సు 58, వృత్తి: సినిమా దర్శకత్వం.**

''ధర్మమూర్తుల ముందు చేసిన పాపం చెబితే పోతుందంటారు పెద్దలు. నేను 30 సిన్మాలకు దర్శకత్వం వహించాను. అందులో 28 శతదినోత్సవాలు చేసుకున్నాయి. నిజం చెప్పాలంటే వాటన్నిటి మూల కథ ఒక్కటే. కొన్నింట్లో ఇద్దరు హీరోలు, ఒక హీరోయిన్ వెరసి త్యాగం, మరికొన్నిటిలో ఇద్దరు హీరోయిన్లు ఒక హీరో ఫలితం త్యాగం. త్యాగాల కన్నీటితో తెలుగు ప్రేక్షక లోకాన్ని పునీతం చేశాను. ఇప్పుడైతే పదహారేళ్ల హీరో, పద్నాలుగేళ్ల హీరోయిన్ కథలతో సినిమాలొస్తున్నాయి కానీ ఇవన్నీ అప్పుడెక్కడివి సార్, అయితే నేను బాగా ఇంగ్లీష్ నవలలు చదివి, హాలీవుడ్ సినిమాల వీడియోలు చూసి రెండు సినిమాలు మటుకు మసాలా కథలతో తీశాను, జనం వీటిని తిప్పికొట్టారు. బాలజంట ప్రేమకథలొచ్చింతర్వాత నన్నడిగే వాడెవరూ లేక పోయారు. ఖాళీగా కూర్చోలేక టైం పాస్ కాక ఇంట్లో ఆవిడ పోరు భరించలేకపోతున్న రోజుల్లో ఈ షమ్మీ ఖన్నా గాడొచ్చి వాడి సినిమాకి దర్శకత్వం వహించమన్నాడు. ఆనందంగా ఒప్పుకున్నాను వీడు హీరో అనగానే ప్రౌఢ వయస్సు వారి ప్రేమకథ తయారు చేశాం. తర్వాత వీడు కథలో చేయి చేసుకొని తల్లి ప్రేమ కొంచెం కలిపాడు. బాబ్బాబు మా నాయినే అట్లా వద్దురా అంటే ఛుప్ బైఠో పైసలు నాయనీయా అనేవాడు వాడి చావు వాడు చావనీ అని వూరుకున్నాను. ఫాంటసీ కావాలని సర్పలోకం సీను సృష్టించాడు. సర్పరాజును గద్దె దింపాలని కొన్ని విలన్ పాములు ప్రయత్నిస్తుంటాయట. వీటికి నడుము కింద సర్పాకారం ఎగువన మనిషాకారం వుంటాయి(ట). విషయం ఆ సర్పరాజుగాడు ఈ షమ్మీఖన్నా గాడికి మొబైల్ ఫోన్‌లో చెబుతాడు. వెనకటికి సాల్మన్ దివైజ్ అనే రాజుండే వాడట. అతనికి క్రిమికీటకాది, పశుపక్ష్యాది సర్వజీవుల భాషలొచ్చట. ఈ షమ్మీఖన్నాకు సార్వభౌమత్వం కట్టబెట్టి సర్పనాయకుడు బిరుదుతో మన జంట నగరాలకు తిరిగొస్తాడు. ఆ తరు


Our Wish HEALTH FOR ALL our Promise
HEALTH INSURANCE FOR ALL



★ GOOD HEALTH POLICY
★ UNIVERSAL HEALTH POLICY
★ MEDICLAIM POLICY
★ NAGRIK SURAKSHA POLICY
★ OVERSEAS MEDICLAIM POLICY

ORIENTAL INSURANCE

Prithvi. Agni. Jal. Aakash.
Sab ki suraksha hamare paas

THE ORIENTAL INSURANCE COMPANY LTD.

REGIONAL OFFICE-HYDERABAD 6-3-871, SNEHALATHA, GREENLANDS, HYDERABAD-500016
VISIT US AT: orientalinsurance.nic.in e-mail: hyd2_oichyd@sancharnet.in
INSURANCE IS THE SUBJECT MATTER OF SOLICITATION

వాత ఈ ప్రాపంచిక స్థానిక, లౌకిక, భౌతిక విలన్లను ఇక్కడ చావగొడతాడు. స్టెప్పులనబడే గంతులతో పాటలు పాడి సినిమా ఆఖరులో కృష్ణ పరమాత్మ వేషంలో ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే అంటుండగా వెనక బ్యాక్‌గ్రౌండ్‌లో డ్రమ్ములు, డప్పులు, కొమ్ముబూరలు, రాండోళ్లు మోగుతుంటాయి. నక్కల వూళలు వినబతాయి. అవెందుకురా అంటే విద్దభూమిలో పీనుగుల కాడికి నక్కలు కాకపోతే నువ్వొస్తవా నీ పెళ్లాం వస్తదా అని వీడి భయం. పైగా ఒక రోజు ఉదయం నేను షూటింగ్ స్పాట్‌కెళ్లేసరికి వీడు రాజకుమారుడి డ్రస్సులో ఖడ్గం చేతబూని మైసమ్మ గుడి మెట్లమీద కనిపించాడు. ఇదేమిట్రా నీ అమ్మకడుపు మాడా, నిన్నటిదాకా సాంఘికం కదా మనం తీసింది ఇప్పుడీ ఓవర్‌నైటు మార్పేమిటీ అనడిగా. సాంఘికం జానపదం చారిత్రకం అనే భేదాలు మనం సృష్టించుకున్నవేనట. మనుషులు ఏ కాలంలోనైనా మనుషులేనట. వాళ్ల బుద్దుల్లో మార్పుండదట. కాకపోతే డ్రస్సులు, ఆయుధాలు మారతాయట. వీణ్ణి చర్మం వొలిచి వుప్పుకారం జల్లినా పాపం లేదు. పైగా ఏదో సినిమాలో ఎవరో హీరో గుడి దగ్గర కత్తిసాము చేశాడట. వీడూ అలాగే చేస్తాడట. బాబ్బాబు ఇక్కడున్న వాళ్లంతా వీణ్ణి తలా ఒక చెప్పుదెబ్బ- తమ శక్త్యానుసారం కొట్టండి. పాపమేమీ లేదు. నేను హామీ ఇస్తున్నాను. డయాబెటిస్ పేషెంటునురా టిఫిను తెప్పించరా అని వాడి కడుపులో తలపెట్టి వలవలా ఏడిస్తే కారం బాగా రాసిన అటుకులు పెట్టేవాడు. నన్ను కెమెరా దగ్గరకు రాకుండే అడ్డేవాడు. ఒకనాడు ఇంకొంచెం సెక్సు కలుపుదాం అన్నాడు. కలిపేదే ముందిరా వున్నదంతా సెక్సే కదా అన్నాను. దాంతో మళ్లీ బండబూతులు తిట్టాడు. వీడి నీచ బుద్ధి ఉదంతం ఇంకొకటి చెపుతాను సార్ వీడు ఒక సీనులో తన తల్లికి చెప్పులు తొడిగించాలి. హీరో ఆడదాని చెప్పులు ముట్టుకుంటడా దిమాఖ్ లేదా బద్మాష్ అని తిట్టాడు. తర్వాత ఆ తల్లి చనిపోయినట్టు సజెస చేసి గోడకు ఫోటో పూలమాల తయారు చేశాడు. తన పాత్రను అర్ధాంతరంగా చంపినందుకు వకుళమాంబ గోలపెడితే పదివేలకు ప్రామిసరీ నోటు రాశాడు కానీ చేతిలో నగదున్నా పైసా ఇవ్వలేదు. వీడు నిర్మాత కాదండీ రౌడీ ప్రొడ్యూసర్.

**(సుబ్బిరెడ్డి మాటలాపేసి గుండెలెగసి పడేలా ఏడవడం మొదలుపెట్టాడు. ఎవరూ అతడిని ఆపలేదు. ఏడ్చి ఏడ్చి తనకు తానే సంబాళించుకుని మళ్లీ కథ ప్రారంభించబోయే ముందు కోర్టులో ఒక ముసలావిడ ఏడవటం మొదలెట్టింది. కొడకా నీకు సీతమరి కష్టాలొచ్చినాయి కొడకా అంటూ ఎగిరెగిరి పడసాగింది. జనం ఆమెను వూర్కోబెట్టారు).**

''అసలు వీడిని చెడగొట్టించి ఆశ్రీ – ఏస్కోడిగామాలండి. ఆశ్రీ ఏస్కోడిగామా ట్యూన్ కట్టాడండీ. పాటేమో మన భాష రాని వాడు ఇనుప గొంతుతో పాడాడండి. మగా ఆడాకాని మధ్య గొంతుతో ఆశ్రీగాడి సొంత అక్క గళం కలిపిందండీ''.

**స్వల్ప అంతరాయం**

పాట ప్రసక్తిరాగానే కోర్టులో ఒక స్తంభం చాటున నిలబడ్డ శాల్తీ కోర్టు మధ్యలోకి దూకింది. ''అకస్మాత్తుగా స్తంభం నుంచి బయటికొచ్చిన నరసింహస్వామిలా ఎవడ్రానువ్వు?'' రాంరెడ్డి గద్దించాడు. అదేమీ లెక్కచేయకుండా ఒన్- టూ - త్రీ అంటూ చిటికలు చిందులు వేస్తూ ఆ శాల్తీ పాటందుకుంది.

**పల్లవి: ముల్లునాదయితే ఆ ఆ ఆ ఆకు నీదిగా**
**ఆ ఆ ఆకు నాదయితే ముల్లు నీదిగా**
**ముల్లు ఆకు కలిశాయంటే ముంచుకొస్తుందే ముప్పు**
**ముప్పు ముప్పని భయపెడితే ఎంతకాలమో చెప్పు**

''సార్ హీరోయిన్ అరటితోటలో రెండు అరటి చెట్ల మధ్య నిలబడి తన ముఖాన్ని అరటి ఆకులతో కప్పుతూ విప్పుతూ వుంటుంది. హీరో చేతిలో ముల్లు గ్రాఫిక్స్ వల్ల ముల్లులా కత్తిలా క్షణక్షణమూ మారిపోతూ వుంటుంది. షమ్మన్న సీక్వెన్స్ చెప్పగానే ఈ ట్యూన్ తయారు చేశాను. ఆశ్రీ కూడా ట్యూన్ చేసింతర్వాతే మాటలు తూచినట్లు వేశాడు. బాగుందా సార్? మేస్త్రీటు గార్కి తల గిర్రున తిరిగింది. ''ఇంత బూతా? తక్షణం వీణ్ణి కస్టడీలోకి తీసుకోండి'' ఇద్దరు కానిస్టేబుల్స్ వాడిని పెడరెక్కలు విరిచి పట్టుకున్నారు. ''అయితే వీడు ఆగంతక ముద్దాయి సార్. నెంబర్ 3 అన్నాడు రాంరెడ్డి.

''నీ పేరేంట్రా''

''ఏస్కోడిగామా''

''అదేం పేర్రా పోర్చుగల్లు వాడివారా?''

''కాదండీ మాది పానగల్లు''

''మరదేం పేర్రా?''

''అదంతేనండి నేను మ్యూజికల్ డైరెక్టరీ కదా పాట ఏ భాష సినిమాలోనిదయినా ట్యూన్ నచ్చితే నా ఖాతాలో ఏస్కుంటుంటాను. అట్లా ఏస్కుంటుంటే నా పేరు ఏస్కోడిగామా అని అభిమానులు పెట్టారు. షమ్మన్న సర్పనాయకుడి సినిమాలో పాటలన్నీ అదరగొట్టాను''

''మ్యూజికల్ కాదురా మ్యూజిక్ డైరెక్టరనాలి. సరే గాని నీకు కర్ణాటక సంగీతం తెలుసురా?''

''కర్ణాటక రాష్ట్రానికి వేరే సంగీతం వుందా'' ఆశ్చర్యపోతూ అన్నాడు.

''నా దృష్టిలో సంగీతం ప్రపంచపు సొత్తు దానికి రాష్ట్రాల హద్దులు లేవు''

ఎ. పి. పి. వో. కు మండుకొచ్చింది.

''అయితే ప్రపంచంలోని ఎక్కడి సంగీతాన్నయినా కాపీ కొడతావా?''

''కాపీ అని చెప్పను సొంతం అనే చెబుతా''

''నీకు వాయిద్యాల పేర్లన్నీ తెలుసురా?''

''అవసరం లేదు. కీ బోర్డు ప్లేయరొకడ్ని నా ఖాతాలో ఏసుకున్నా''

ఇక వీడితో మాట్లాడి లాభం లేదు వీడు కనపడని దొంగతనాలు చేస్తున్నాడు. వీడు మేథోచౌర్యం చేస్తున్నాడు. సంగీతం కాపీరైటు కిందికి రాదు. వచ్చినా దాని అసలు సృష్టికర్త కేసు పెట్టాలి. ఇలా ఆలోచించి మేస్త్రీటు గారు కోర్టు విచారణకు అంతరాయం కలిగించినందుకు ఆర్నెల్ల జైలు శిక్ష వడ్డించారు. ఏస్కోడిగామా ఉడ్చుకుంటూ తనని లాక్కెళ్తున్న పోలీసుల వెంట వెళ్ళిపోయాడు.

బయట జనంలో ఏస్కోడిని గుర్తుపట్టిన వాళ్ళు ఒక్కడయిపోయాడ్రా మిగతా వాళ్ల విడుదలయితే వాళ్ల సంగతి మనం చూసుకుందామనే ఏకాభిప్రాయానికొచ్చారు. ముల్లు ఆకు పాట విన్న తర్వాత తనకు కూడా శిక్ష పడుతుందని ఆశ్రీ కంపించిపోయాడు. తెలివిగా పిల్లిలా అడుగులు వేస్తూ కోర్టు హాలు దాటుకుని జన సముద్రంలో కల్సిపోయి ఆ తర్వాత నెమ్మదిగా రోడ్డెక్కి దౌడు తీశాడు. బయటుంటే నాలుగు పాటలు రాసుకోవచ్చు. జైల్లోకూడా రాసుకోవచ్చుటగాని అక్కడ చాకిరీ బాగా చేయిస్తారట. పోదూ మన కెందుకొచ్చిన తంటా అనుకుని పరుగు వేగం పెంచాడు.

''ఏస్కోడిగారూ! కాదు కాదు సుబ్బిరెడ్డిగారూ మిగతా సంగతి చెప్పండి. మనం మీరూ మీరూ ఎందుక్కొట్టుకున్నారనే విషయానికి పరిమితమయితే బాగుంటుంది'' మేస్త్రీటుగారు సూచించారు.

**చింతిర్యాల సుబ్బిరెడ్డి**

''నాకూ అర్థం కావటం లేదు సార్. రాత్రి ఖన్నాగాడూ నేనూ సర్పనాయకుడు సినిమాకి వెళ్లాం. సినిమా చూస్తున్న జనం చాలా మంది బయటికి వెళ్లి వాంతులు చేసుకోవటం చూశాను. కొందరాడవాళ్లు మూర్చపోయారు. కొంతమంది మటుకు ఖన్నానూ నన్నూ అడ్డమైన బూతులు తిట్టున్నారు. ఈ లోపు ఇంటర్వెల్ అయింది. కూల్ డ్రింక్ షాపు దగ్గరకొచ్చేసరికి ఈ కుర్రాళ్లిద్దరూ ఖన్నాను తిడుతున్నారు. ఖన్నా వాళ్లని కారణం అడిగాడు. తర్వాత వాళ్లు మొదట ఖన్నాను, మధ్యలో ఆపమన్నందుకు నన్నూ తన్నారు. జనం మావేపు గుంపులుగా ఆవేశంగా రావటం చూసి స్టేషన్ కొచ్చాం. ఈ కుర్రాళ్లిద్దరూ అక్కడే వున్నారు. వాళ్లని మేం తన్నినట్లుగా రాంరెడ్డిగారికి చెప్పారు. ఇలా రామిరెడ్డిగారు మమ్మల్ని తమ ముందు హాజరు పరిచారు''

**ఇద్దరు కుర్రాళ్లు**

''మా ఇస్టేట్‌మెంట్ గూడా అదే సార్ ఆ సిన్మా చూసిన జనం వాంతులు చేసుకున్నరు. సొమ్మొచ్చి పడ్డరు. ఉత్తుత్తిగనే నారాజ్ అయితుండ్రు, మా హాలత్ కూడా అదే సార్ మేం సిన్మా తీసినోడిని తిడ్తుంటే ఈ బొర్రోడు నఖరాలు చేయబట్టిండు. అసలే రిమ్మమీద వున్నం. ఇగ వీడిని యమబాదుడు బాదినం సార్. తప్పయితే క్షమించండి. వానితో దుష్మనీ లేదు సార్. తప్పంతా సినిమాదే. తమరేం శిక్షసినా బడతం. మీ కాల్మొక్తం.

మేస్త్రీటుగారు విచారణ ముగిసినట్లుగా ప్రకటించారు. ఆయన ఒక కొత్త ప్రతిపాదన పెట్టారు.

కుర్రాళ్లు, సుబ్బిరెడ్డి చెప్పిందంతా నిజమా అబద్ధమా తెలుసుకోవటానికి ఆ సినిమా తనూ ఎ.పి.పి.వో మరికొంత మంది లాయర్లు చూడాలి. ఆ రాత్రికే ప్రత్యేక ప్రదర్శన, మర్నాడు తీర్పు అని ప్రకటించారు. ఆయన ఒక కొత్త ప్రతిపాదన పెట్టారు. కుర్రాళ్లు, సుబ్బారెడ్డి చెప్పిందంతా నిజమా అబద్ధమా తెలుసుకోవటానికి ఆ సినిమా తనూ ఎ. పి. పి. వో. మరికొంతమంది లాయర్లు చూడాలి. ఆ రాత్రికే ప్రత్యేక ప్రదర్శన, మర్నాడు తీర్పు అని ప్రకటించారు. ఎ. పి. పి. వో. ముందుచూపుగా వ్యవహరించి ఒక అంబులెన్స్‌నూ, ఒక 108ని హాలు దగ్గర వుండేలా ఏర్పాటు చేశాడు. ఆ రాత్రి అంతా అనుకున్న ప్రకారం సినిమా చూశారు. మేస్ట్రీటుగారు కాస్సేపు తన పేరేమిటో తన ఉద్యోగమేమిటో మర్చిపోయారు. కాసేపు భూత, భవిష్యద్వర్తమానాల మధ్య ఊగిసలాడారు. హాలు బయటికి రాగానే అన్నీ యథావిధిగా గుర్తుకొచ్చాయి. ఎ. పి. పి. వో. ను 108 ఒక హాస్పిటల్‌కూ, ఒక సీనియర్ లాయర్‌ను అంబులెన్స్ ఇంకొక హాస్పిటల్‌కు పట్టుకెళ్లిపోయాయి.

**తీర్పు**

జనం కిటకిటలాడుతున్నారు. మేస్ట్రీటుగారు గొంతు సవరించుకుని సినిమాలు ఒకప్పుడు ఎలా గుండేయో వివరించారు. సినిమాలు– ఆ మాట కొస్తే ప్రతికళారూపానికొక సామాజిక ప్రయోజనముండాలి అన్నారు. పిల్లల్ని పెద్దల్ని ఏకకాలంలో చెడగొట్టే సినిమాలు మనకొద్దు అని హితవు చెప్పారు. సినిమాలు సమాజానికి సత్‌సందేశం పంపే రోజుకోసం తను వేచి వుంటానని తప్పుడు సంకేతాలు పంపే సినిమాలను తిప్పి కొట్టే బాధ్యత పంపే రోజుకోసం తను వేచివుంటానని తప్పుడు సంకేతాలు పంపే సినిమాలను తిప్పికొట్టే బాధ్యత ప్రేక్షకుల మీదే వుందని అటువంటి మం చిరోజు వస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. సగటు ప్రేక్షకులు వినోదం నిమిత్తం వస్తే వారిని ఆసుపత్రులకు పంపే సినిమాలు ఆ ప్రేక్షకులకు అదనపు ఖర్చు తగిలిస్తాయని ఆవేశపడ్డారు. సమాజంలో అవినీతిపరులతోపాటు నీతిపరులు కూడా వున్నందుకు ఈ సమాజం ఈ మాత్రమైనా వుంది. అలాగే మంచి సినిమాలు కూడా వుండబట్టే ప్రేక్షకులు ఈ మాత్రం ఆరోగ్యంగా వున్నారని హర్షాతిరేకంతో తన అభిప్రాయం కొంచె ఉద్వేగంతో కరతాళధ్వనుల మధ్య ప్రకటించారు. సామూహికంగా జనానికి మతి పోగొట్టి ప్రజా ఆరోగ్యాన్ని దెబ్బతీసే సర్వనాయకుడు సినిమాను వెంటనే బ్యాన్ చేయాలని ప్రభుత్వానికి సూచించారు. ఇక కేసు విషయానికొస్తే కుర్రాళ్ల తప్పు ఏమీలేదని షమ్మీ ఖన్నాను ఆవేశంలో హత్య చేయకుండా సంయమనం పాటించి కేవలం దెబ్బలతో విడిచిపెట్టిన వారి విజ్ఞత శ్లాఘనీయం అన్నారు. వాళ్లిద్దరూ వచ్చే సంవత్సరం వరకూ ఆవేశం అదుపులో పెట్టుకుని ఎవరినీ కొట్టకుండా వుండేట్లు మంచి ప్రవర్తన కొరకు బాండు రాసిచ్చి వెళ్లిపొమ్మన్నారు.

ఇక షమ్మీఖన్నాను క్షమించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. సినిమా అనేది సకల కళల సమాహారమని తెలుసుకోకుండా పిచ్చి పిచ్చి సినిమాలు డబ్బుబలంతో తీసి ప్రజారోగ్యానికి భంగం కలిగించినందుకు ఏడాది కఠిన కారాగారం విధించనైనది అన్నారు. సుబ్బారెడ్డి హమ్మయ్య అనుకున్నాడు. శిక్ష తనకు తప్పిపోయిందని సంతోషించేంతలో... ఇక సుబ్బారెడ్డి విషయానికొస్తే ఎంతో అనుభవం వుండి కూడా కేవలం తన పేరు మళ్లీ తెరమీద చూసుకోవాలనే ప్రలోభానికి లొంగి షమ్మీఖన్నాకు తోడ్పడినట్టు భావిస్తూ ఆర్నెల్ల జైలు శిక్ష అన్నారు.

''ఇంగ తీసే రెండు సిన్మాలు, కసితో తీస్తా. యూత్ సబ్జెక్టు జర్రశిక్ష తగ్గించరాదే'' షమ్మీ ప్రాధేయపడ్డాడు.

''ఇప్పుడు చూపించిన కసి చాలు. మారు మాట్లాడితే శిక్ష పెరుగుతుంది'' ఎ. పి.పి. వో హెచ్చరించాడు. జైలు సూపరింటెండెంట్ సుబ్బిరెడ్డి గారూ ''మీరూ పెద్దలు ఇలా'' అంటూ వాపోయాడు.

''ప్చ్ చట్టం తన పని తాను చేసుక పోయింది'' అన్నాడు సుబ్బిరెడ్డి.

**భశుం**

